తరువాత వాళ్లు అండమాన్లకు పంపినా పోతాను."

"ఇప్పుడు అండమాన్లకు పంపటం లేదు. కాబట్టి పోతానంటావా?"

"సరేగాని ప్రస్తుతం వాళ్లు పట్టుకెళ్లకుండా ఉండే మార్గం చూడు."

"వాళ్లు పట్టుకెళ్ళే మాటయితే యీ పదిహేను రోజుల తరువాత విడిపించే భారం నాది."

"ఇంతకూ ఆపించలేనంటావు."

"నీకు తెలియని దేమిటయ్యా" వాళ్ళ ధర్మం వాళ్ళని చెయ్యకుండా చేయాలంటే ఏ సిఫార్సో లంచమో, మరొక అక్రమ మార్గమో తొక్కాలి గదా? అలా చెయ్యటం నీ కిష్టమేనా? ఇష్టముంటే చెయ్యను అని చెప్పలేను. కాని ఆలోచించ వలసి ఉంటుంది."

"అంతేనా. అన్యాయంగా కొంతమంది వ్యక్తుల జీవితాలు, ధర్మభిన్నం కావలసిందేనా? ఇంత ప్రేగులు తెంచుకోవటం వ్యర్థమేనా? చూడగా చూడగా పురుష ప్రయత్నానికి అవల విధి అనేది ఒకటి ఉన్నదేమో ననిపిస్తున్నది డాక్టరుగారూ!"

"అసలు సంగతేమిటో చెప్పక అంగలార్చితే ప్రయోజనమేమిటయ్యా!"

"నింపాదిమీద మీకే తెలుస్తుంది. ఇప్పుడు చెప్పటం ఏమంత మంచిది కాదు. నేను భోజనం చేసి పోలీసులు వస్తే ఇక్కడకు రమ్మని చెప్పి వస్తాను. ఇక్కడే ఉంటారు కాదు" అని అడిగి రామారావు ఇంటికి వెళ్ళాడు.

"ఏదో ప్రవాహంలో చిక్కుకొన్నట్లున్నాడు" డాక్టరు జాలి పడ్డాడు.

(ఇంకా వుంది.)

స్కెచ్

# అక్షరాలా...

పండితారాధ్యుల పరంధామయ్య

కొంతయ్య ఆ దృశ్యం చూచి నిలువునా కంపించి ఒక్క అడుగు వెనక్కు వేశాడు. నిన్న సాయంత్రంనుండి అతన్ని పీడిస్తున్న అనుమానం కాస్తా ధృఢం కావడంతో అతని ఒళ్లంతా తేళ్లు జెర్రులు ప్రాకినట్లయింది. ఇంత పబ్లికుగా తన యింట్లో తన యిష్టానికి వ్యతిరేకంగా కుట్ర జరుగుతుందని అతడు కలలో గూడా అనుకొని వుండలేదు. ధైర్యంగా ముందుకు బోయి వాళ్ళని యెదుర్కొనదలచాడు. కాని ఎంత ప్రయత్నించినా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. తన సాహసంపై తనకింత బొత్తిగా నమ్మకంలేని దుస్థితి ఇంతకు ముందెప్పుడూ అతను అనుభవించక పోవటంతో ఒక విధంగా కించుత్తూ భయపడినటువంటివాడై తాపీగా ఆలోచించటం సాగించాడు. దాని పర్యవసానం ఎందుకయినా నిదానం అంతటి శ్రేష్ఠమైన పదార్థం మరొకటి లేదని మొండి గోడచాటున నిలబడ్డాడు. లోపల చర్చలు మహా జోరుగా సాగుతున్నాయి. కనీసం డజను మందైనా వుంటారు. ఇంతమంది యీ అర గంటలో ఎలా పోగైనారా, అసలు ఈ సందున యింతమంది ఆడవాళ్లు చర్చలంటే యింత కుతూహలం చూపించేవాళ్లు వున్నారా అని అతనికి సందేహాలు కలిగాయి. ఒక్క క్షణంపాటు తన సందేహాలన్నిటికీ వాయిదావేసి వాళ్ల ఆర్గ్యుమెంట్లను వినటానికి ప్రయత్నించాడు. స్పష్టంగా తెలియకపోయినా వారు మాట్లాడే విషయంమాత్రం రాజకీయాలు. నాలుగేళ్ల స్వతంత్రంలో యింత రాజకీయ చైతన్యాన్ని తన గృహంలో యింతమంది మహిళలు చేరి ప్రదర్శిస్తుంటే అతని కెందుకో పట్టరాని కోపం వచ్చింది. ఇంతలో కొంతయ్య గుండెలు జల్లుమన్నాయి. "నీ భార్యను నాయకురాలిని జేశావా పంతులు?-కొంచెం గుమ్మంలో

బెట్టవయ్యా" అని నాయుడు అనడం-"ఏదో గిట్టనివాళ్లు అని వుంటారు" అని తాను చేతులు నలుపుకోటం - "కాని తెలుస్తుందిగా" - అని నాయుడు అనటం కొంతయ్యను రాత్రంతా నిద్రపోనీకుండా చేసింది.

కొంతయ్య నాయుడుగారివద్ద గుమాస్తా. రెండు ఎకరాల కొండ్ర వుంది. ఆ భూమిని నాయుడుగారే దున్నించి పెడతారు. ఆ పొలంలోని ధాన్యాన్ని తింటూ పైఖర్చుకు నాయుడిగారి జీతం వాడుకుంటాడు. అయినా కొంతయ్య నాయుడువద్ద రెండు వందలదాకా అప్పులు చేయవలసి వచ్చింది. అకస్మాత్తుగా వచ్చే జబ్బులకు ప్రమాణాలకు కొంతయ్య ఎంత మప్పితపు మనిషయినా కూడా బెట్టలేక పోయ్యాడు. కొంతయ్య భార్య కొంచెం సరదా మనిషి. పెనులో పెరిగింది కాబట్టి ఏదో కొంచెం చదువుకొంది కాబట్టి నలుగురితో కలుపుగోలుతనంగా వుండటంవల్ల చుట్టుపక్కలవాళ్లు కొంతయ్యలేని సమయంలో అతని యింటికి రావటం కబుర్లు చెప్పుకోటం జరుగుతుండేది. అంతేగాని రాజకీయాలవరకు నారెప్పుడు వెళ్ళివుండలేదు. ఇంతలో ఎన్నికలు రావటం దేశంమారుమూలల్లోకూడా రాజకీయ వాతావరణం వ్యాపించటం జరిగింది. కొంతయ్య గృహంకూడా దాన్లో పాలు పుచ్చుకోక తప్పిందికాదు. ఈ మార్పు క్రమక్రమంగా జరిగినా కొంతయ్య మాత్రం తన గృహప్రాంగణంలో విప్లవం వచ్చినట్టే భావించాడు. పొరపాటునైనా యిల్లు కదలని యీ మనుషులకంతా రాజకీయాలపై యింతటి ఆసక్తి కలగటం తన ముప్పుకే కాబోలని వేగార్గిన ముఖంతో చుట్టూ నిష్కారణంగా కలియచూశాడు. నాయుడు పంపిన గూఢచారులు ఆ సందంతా నిండివున్నట్లు భయపడ్డాడు. తానూ తన బిడ్డలు నాయుడు దయాధర్మంపై బ్రతికవలసిన యీనాడు అతనిపైనే కత్తి కట్టడమా? కొంతయ్య తన భార్యపై మండిపడ్డాడు. పోయి గుంపునంతా తరిమేద్దామా అన్నంత ఆవేశమొచ్చింది. మెల్లగా గేటుదీసి లోపలికడుగు బెట్టాడో లేదో నోట మాటరాలేదు. తల వేలాడేసుకొని తడబడే అడుగులతో వరండాలోని స్త్రీల సభాస్థలాన్ని దాటి యింట్లోకి వెళ్ళి నులకమంచంమీద కూలబడ్డాడు. వరండాలో చర్చలు జోరుగా సాగుతున్నాయి. అప్పుడప్పుడు నవ్వులు, వేళాకోళాలు. కొంతయ్య బాధ వాళ్ళకేం తెలుసు. ఒక్కరొక్కరే వెళ్ళిపోవటానికి సన్నద్ధం కావటం తన భార్య వారిని రేపు పెందలాడే రావాలని ఆహ్వానించటం, కొంతయ్య పళ్ళు మండుతూంది. కాని అతనికి ఎంత ఉద్రేకం వచ్చిందంటే ఒక్కడికేమాట అనటానికి కూడా శక్తి లేకుండా పోయింది. తన భార్యపై విపరీతమైన కోపం పుట్టుకొచ్చింది. పళ్ళు పటపట కొరుకుతూ పక్కనున్న కాళీ కిరసనాయిలు డబ్బాపై ఒకగుద్దు గుద్దాడు. అదే సమయంలో స్నేహితురాండ్రను యిండ్లకు పంపి వచ్చిన అతని ధర్మపత్ని కొంతయ్య ఆకారాన్నిచూస్తే ఉగ్రకాలం నిశ్చేష్టితయై వచ్చే నవ్వును ఆపుకుంటూ—

"అలా వున్నారేం?" అడిగింది.

కొంతయ్య మాటి ముసుగుని కూర్చున్నాడు.

"పలకరేమండి" ఆమె పెదవులపై యింకా చిరునవ్వు ఉంది.

"ఏముంది పలకటానికి? నా బ్రతుకే నవ్వులాటగా వుంది."

"నేను నవ్వినందుకా? మరి మీరెందుకలా ముఖాన్ని బెట్టారు ఏదో మునిగిపోతున్నట్లు? చెప్పకూడదూ?"

"ఏముంది నా రాత. అందరికీ దుర్బుద్ధి పుడుతుంది."

"అదేమిటి ఏనాడూ అనని మాటలు అంటున్నారే?"

"ఏనాడైనా యీలా చేశావా? యీ గుంపునంతా చేర్చి."

"చెప్పండి, చేర్చి?"

"ఎందుకో నాకు తెలుసా? ఎవరెట్లా చస్తే మనకేం?"

"వాళ్ళ బ్రతుకే మన బ్రతుకు కాబట్టి అనుకుంటున్నాం లెండి. అబ్బా! ఎంత ఆర్భాటం చేశారండి."

"ఆర్భాటం కాదు, నా ప్రారబ్ధం."

"ఏమిటాలా ముంచుకపోయినట్లు మాట్లాడుతున్నారు?"

"ముంచుకపోయింది. తీరా మునిగింది కూడాను. మనమెంత మన తాహతెంత. మనకీ లేనిపోని రాజకీయాలెందుకు? కొంప నొక సత్రం మాదిరి తయారు జేశావు."

"అబ్బే! అలా హైరాను పడతారు దేనికి. ఎవరన్నా వింటే నవ్విపోతారు. ఏదో పుబుసుపోక నలుగురం చేరాం. పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నాం. దీంట్లో మీకొచ్చిన యిబ్బంది యేముంది?"

"ఓహో! చాలా తేలికగా తోసేస్తున్నావే? యిబ్బందట యిబ్బంది. గొంతుకు వురి బిగుసుకుంటుంటే, నిన్న నాయుడు అంటె ఏమో ననుకొన్నాను."

"ఏమన్నాడు?"

"ఏమంటాడు, 'ఏమి పంతులూ భార్యను నాయకురాలిగా జేశావటనే,' అని. ఇలా ఇంటి కొస్తిని కథా నీపీ యెత్తులో వుంటివి. నాయుడంటే ఎవరనుకున్నావ్? చండప్రచండుడు. బ్రతుకుతెరువు కూడా పోయిందంటె మన బిడ్డలు మనం..."

"అయితే మీరిప్పుడు చెప్పేదేంది."

"ఈ మీటింగులు పెట్టవద్దంటాను. ఏ వెధవ యెట్లా చస్తే మనకేం. మన కష్టాలు తీరుస్తారు గనకనా? కాబట్టి, మనం మన వూహాలు, వుద్దేశాలు, అవి యెటువంటివైనా బయటికి పొక్కనీకుండా వుండటం శ్రేయస్కరం."

"అయితే మనకు మాట్లాడే స్వతంత్రం కూడా లేదన్న మాట."

"స్వతంత్రం! కూటికి గుడ్డకి లేని స్వతంత్రం యెవరిని వుద్ధరించటానికి? రేపు నాయుడు 'పంతులూ నీ పనిలోనుండి నిలచిపో'మ్మంటె? యీ మాట్లాడే స్వాతంత్ర్య మేమన్నా మనకు వొరగిస్తుందా? పిచ్చిదానా మనకున్న స్వాతంత్ర్య మొక్కటె, కడుపు కాల్చుకునే స్వాతంత్ర్యం. ఎంతటి బాధనయినా కిక్కురు మనకుండా వోర్చుకొనే స్వాతంత్ర్యం. తెలిసిందా?"

"చదువుకొని ఏదో యింత విజ్ఞానం గల మనమే యీలాగైతే మరింకేముంది?"

"ఏమి వుండదు. లేనిపోని కష్టాలను వృథాగా ఎందుకు కొని తెచ్చుకోటం. ఎవడో వొకడు గెలుస్తాడు. మరలా మంత్రులు తయారవుతారు. పాడిందే మరలా పాడుతారు. మన స్థితిమాత్రం యథాప్రకారం వుంటుంది."

"అలాగని నాయుడు చెప్పినట్లు—"

"అబ్బే! అది నీయిష్టం. రహస్య వోటింగు కదా. ప్రచారం మాత్రం వద్దు."

"మరి తర్కించుకోండే మంచి యెవరని తేలే దెట్లా?"

"ఆ తర్కమే వద్దు. అది ప్రమాదం. నీ మనసులో తర్కించుకో. కాని పెదిమలు మాత్రం కదిపితివా? నాకు కూడా చెప్పవద్దు. నీ యిష్టమొచ్చిన వారికి వెయ్యి. తెలిసిందా?"

"ఏమిటో నాకంతా అయోమయంగా వుంది. ఆ నాయుడు మీరు చేసే చాకిరీని గాక మన మాటలు అభిప్రాయాలు కూడా ఎలా వుండాలో నిర్ణయించేట్టుందే?"

"అవురా అలా అంతే!"

చర్చిల్ ట్రూమన్‌ల సంభాషణలు జరిగే తరుణంలోనే స్టాలిన్ అనారోగ్య వార్తలు పాశ్చాత్యదేశాల పత్రికలలో వెలువడుతున్నవి. లెనిన్ బ్రతికివుండగా పై దేశాల పత్రికలు ఆయనను ఎన్నిమారులో విగత జీవుణ్ణి చేసినవి. ఈ పత్రికల చేతులలో స్టాలిన్‌కు సయితం ఇట్టి చావుపుట్టుకలు తప్పలేదు.

ఈతూరి స్టాలిన్ అనారోగ్యం అభాండమేనో లేక వాస్తవమో (స్టాలిన్ వయస్సు 70 దాటింది) చెప్పలేము.—ఆంధ్రప్రభ సంపాదకీయం